


# ఎల్లయ్ మామా

వేసవి శలవులకి నల్గొండ వెళ్ళింది శారద. వాళ్ళ మావయ్య అక్కడ లేబర్ ఇన్స్పెక్టరు. వాళ్ళది చాలా విశాలమైన ఇల్లు, అంతకన్నా విశాలమైన వాకిలి, కొంచెం ఊరికి పెడగా వున్న ఇల్లు.

ఓ రోజు మధ్యాహ్నం వరండాలో ఈజీచైర్లో కూర్చుని సీరియల్ చదువుతోంది శారద. మధ్య గదిలో కూలర్ దగ్గిర పడుకుని మామయ్యల్లలు నిద్రపోతున్నారు. పెరట్లో ఎక్కడో మామయ్య భార్య దుర్గాదేవి బట్టలారేస్తోంది.

ఇంతలో గేటు తీసుకొని పల్లెటూరు తరహాగా ఉన్న ఒక మనిసి "ఎల్లయ్‌గారు ఉన్నారామ్మా!" అంటూ లోపలికికొచ్చాడు.

"ఎల్లయ్యలేదు, పుల్లయ్యలేదు. పో అవతలికి. ఇందాకటి నుంచి చూస్తున్నాను. మీకందరికీ హాస్యాలుగా ఉన్నట్లుందే" కసిరింది శారద. అసలే ఎండవేడి, అందులో సీరియల్‌వేడి తోడు.

"ఆసికాలేంది దొరసానో? ఎల్లయ్‌గారిల్లు కాదా ఏందిది?" అని వాడు గతుక్కుమని ఏదో గొణుక్కుంటూ జారుకున్నాడు.

ఇంతలో లోపలినుంచి దుర్గాదేవి బయటి కొస్తూ "ఎవరి మీదే అరుస్తున్నావు?" అంది.

"ఎవరో ఎల్లయ్య కావాలట అత్తయ్యా! ఇందాకటి నుంచి నలుగురు వచ్చారు. చస్తున్నాను వీళ్ళకి చెప్పలేక ఎవరీ ఎల్లయ్య?" అంది శారద.



"ఎల్లయ్ అంటే మీ మామయ్యేనే పిచ్చిదానా! ఎల్లయ్ అంటే ఎల్లయ్య కాదు. ఇంగ్లీషులో ఎల్.ఐ. అంటే లేబర్ ఇన్స్పెక్టర్ అన్న మాట! మీ చదువుకున్న పిల్లలకి ఓహ్! మీ గోలే మీది తప్ప కాస్త ఆలోచనా, సాలోచనా వుండదుకదా!" అని నవ్వుకుంటూ లోపలికెళ్ళిపోయింది దుర్గాదేవి.

'హొరా! ఎల్లయ్ మామా!' అంటూ నిలబడిపోయింది శారద, సీరియల్ మర్చిపోయి.